కేతకీలో ఎమ్మెల్యేల పూజలు

ఎమ్మెల్యేలను సన్మానిస్తున్న ఆలయ సిబ్బంది

ఝరాసంగం, జనవరి 22 : దక్షిణ కాశీగా ప్రసిద్ధి చెందిన ఝరాసంగం కేతకీ సంగమేశ్వర స్వామి దేవాలయంలో జహీరాబాద్, నర్సాపూర్ ఎమ్మెల్యేలు మాణిక్‌రావు, సునీతా లక్ష్మారెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. బుధవారం ఆలయ రాజగోపురం ఎదుట ఎమ్మెల్యేలకు అర్చకులు వేద మంత్రాలు వల్లిస్తూ పూర్ణకుంభంతో పలికారు. గర్భగుడిలోని పార్వతీ సమేత సంగమేశ్వర స్వామిని దర్శించుకొని అభిషేకం, మహా మంగళహారతి పూ జలు నిర్వహించారు. ఆలయ అధికారులు వారికి పూలమాల, శాలువతో సన్మానించి తీర్థప్రసాదాలు అందజేశారు. వారి వెంట ఉమ్మడి మెదక్ జిల్లా డీసీఎంఎస్ చైర్మన్ శివకుమార్, మండల బీఆర్‌ఎస్ అధ్యక్షుడు వెం కటేశం, సర్పంచ్‌ల ఫోరం మాజీ అధ్యక్షుడు జగదీశ్వర్, కేతకీ ఆలయ మాజీ చైర్మన్ నీల వెంకటేశం, నాయకులు నామ రవికిరణ్, ఎంపీ నాగన్న, నర్సాపూరం నియోజకవర్గం నాయకులు ఉన్నారు.

బాధితులకు మాజీ ఎమ్మెల్యే పరామర్శ

కల్హేర్ : బాధిత కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

కల్హేర్,జనవరి 22 : కల్హేర్ మండల పరిధిలోని కృష్ణాపూర్ గ్రామానికి చెందిన బేగరి అమృత్ ఇటీవల మృతి చెందడంతో ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి పరామర్శించారు. మాజీ సర్పంచ్ కిష్టారెడ్డి కంటి శస్త్ర చికిత్స, చాకలి మొగులయ్య కుమారుడు రోడ్డు ప్రమాదంలో గాయ పడటంతో వారి ఇంటికి వెళ్లి పరామర్శించారు. ఆయన వెంట మాజీ జడ్పీటీసీ నర్సింహరెడ్డి, మండలాధ్యక్షుడు రాంసింగ్, మాజీ జిల్లా కో-అప్షన్ సభ్యుడు అలీ, పీఏసీఎస్ చైర్మన్ రాంరెడ్డి, నాయకులు శ్రీనివాస్ గౌడ్, పండరి, రాములు, పీరయ్య, చంద్రశేఖర్‌రెడ్డి, చంద్రప్ప, హన్మాండ్లు, వెంకయ్య తదితరులు పాల్గొన్నారు.

నారాయణఖేడ్‌లో..

నారాయణఖేడ్, జనవరి 22 : నారాయణఖేడ్ మండలం వెంకటాపూర్‌కు చెందిన మాజీ వార్డు సభ్యురాలు రాంబాయి అనారోగ్యంతో చికిత్స పొందుతున్నట్లు తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే బుధవారం పరామర్శించారు. మాజీ సర్పంచ్‌లు సాయి లు, వెంకటేశం, నాయకులు విఠల్‌రావు, కేశయ్య, సాయిలు పవన్, భవానీ ఉన్నారు.

పకడ్బందీగా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి

అదనపు కలెక్టర్‌కు తమ గోడును విన్నవించుకుంటున్న పాట్‌పల్లి గ్రామస్తుడు

ఝరాసంగం, జనవరి 22 : రైతు భరోసాకు అర్హులు కానీ వారి వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో పొందుపర్చాలని జిల్లా అదనపు కలెక్టర్ మాధురి అధికారులకు సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని తహసీల్‌లో రెవెన్యూ, వ్యవసాయ శాఖ అధికారులకు నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అంతకు ముందు మండల పరిధిలోని పాట్‌పల్లిలో నిర్వహించిన గ్రామసభకు హాజరయ్యారు. ఆసమయంలో పలుమార్లు విద్యుత్ అంతరాయం ఏర్పడింది. ట్రైనీ కలెక్టర్ మనోజ్, తహసీల్దార్ తిరుమల రావు, ఎంపీడీవో సుధాకర్, గిర్దవార్ రామరావు, ఏపీవో రాజ్‌కుమార్, ఏవో వెంకటేశం, ఆయ గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, వ్యవసాయ విస్తరణ అధికారులు, రెవెన్యూ సిబ్బంది, నాయకులు పాల్గొన్నారు.

బాలికలు అన్ని రంగాల్లో ముందుండాలి

కంది, జనవరి 22 : బాలికలు అన్ని రంగాల్లో ముందుండాలని కంది మండల విద్యాధికారి జోగప్ప పిలుపునిచ్చారు. జిల్లా శిశు సంక్షేమ శాఖ మహిళా సాధికారిత కేంద్రం ఆధ్వర్యంలో బుధవారం కంది మండలం మామిడిపల్లి జడ్పీహెచ్ పాఠశాలలో భేటీ బచావో భేటీ పడావో దశాబ్ది ఉత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా బాలికల ప్రాముఖ్యత, విద్యా ప్రాముఖ్యతను తెలియజేస్తూ ప్రతిజ్ఞ చేయించారు. గ్రామంలో సైకిల్, బైక్ ర్యాలీ నిర్వహించారు బాలికల పాధాన్యతపై అవగాహన కల్పించారు. జిల్లా మహిళా సాధికారిత కేంద్రం సమన్వయకర్త పల్లవి, ప్రధానోపాధ్యాయురాలు సుజాత, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చిరుధాన్యాలతోనే సంపూర్ణ ఆరోగ్యం

ఊరేగింపును పూజలు చేసి ప్రారంభిస్తున్న జహీరాబాద్ పట్టణ ఎస్సై కాశీనాథ్

జహీరాబాద్, జనవరి 22 : నిత్యం తీసుకునే ఆహారంలో చిరుధాన్యాలను చేర్చుకోవడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యాన్ని పొందవచ్చని జహీరాబాద్ పట్టణంలోని పస్తాపూర్ డీడీఎస్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ దివ్య వెలుగురి అన్నారు. బుధవారం జహీరాబాద్ పట్టణంలో 25వ పాతపంటల జాతరను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పాత పంటలైన తైదలు, కొర్రలు, సామలు, సజ్జ, జొన్న, పెసర, మినుము తదితర పంటలలో అనేక పోషక పదార్థాలు అధికంగా ఉంటాయని, వాటిని కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అనంతరం పట్టణంలోని కేఫ్ ఎత్నిక్ వద్ద పట్టణ ఎస్సై కాశీనాథ్ ఎడ్ల బండ్లకు ప్రత్యేక పూజలు చేసి ఊరేగింపును ప్రారంభించారు. అనంతరం పట్టణంలోని ప్రధాన వీధుల గుండా డీడీఎస్ మహిళా సంఘాల సభ్యులు, మహిళలు ఆటపాటలతో పాత పంటల విత్తనాలతో కూడిన ఎడ్లబండ్లతో రాంనగర్ వరకు ఊరేగింపును చేపట్టారు. ఈ కార్యక్రమంలో డీడీఎస్-కేవీకే శాస్త్రవేత్త రమేశ్, డీడీఎస్ జాతర కో-ఆర్డినేటర్లు వినయ్ కుమార్, మంజుల, మహిళా సంఘాల నాయకులు నర్సమ్మ, పూలమ్మ, అనురాధ, విజయలక్ష్మి, బాల య్య, నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

చిల్లర మాటలు మాట్లాడితే ఖబడ్దార్

బొల్లారంలో మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ నాయకులు

జిన్నారం బొల్లారం జనవరి 22 : కాంగ్రెస్ నాయకులు నోటికి వచ్చిన చిల్లర మాటలు మాట్లాడితే ఖబడ్దార్ అంటూ జిన్నారం మండల బీఆర్‌ఎస్ అధ్యక్షుడు రాజేశ్, మాజీ ఎంపీటీసీ భార్గవ్ తీవ్రంగా ధ్వజమెత్తారు. రెండు రోజుల కింద బొల్లారంలో అభివృద్ధి పనుల ప్రారంభోత్సవంలో సొంత పార్టీ ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి బీఆర్‌ఎస్ నాయకులు, పాలకవర్గ సభ్యులతో కలిసి ప్రారంభోత్సవాలు చేయడాన్ని కాంగ్రెస్ నాయకులు జీర్ణించుకోలేకపోతున్నారన్నారు. పైగా ప్రోటోకాల్ అంశాన్ని లేవనెత్తుతూ కాంగ్రెస్ నాయకులు చిల్లర రాజకీయాలు చేస్తోందని ఎద్దేవా చేశారు. రానున్న రోజుల్లో కాంగ్రెస్‌కు ప్రజాక్షేత్రంలో గుణపాఠం తప్పదని హెచ్చరించారు. మాజీ సర్పంచ్‌లు శివరాజ్, కొరివి ఆంజనేయులు, చిట్ల సత్యనారాయణ, కౌన్సిలర్లు బీరప్ప యాదవ్, సతీష్, శ్రీకాంత్ యాదవ్, సాయి కిరణ్ రెడ్డి, నాయకులు నరేందర్, రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

DOCUMENT LOST

I, MOHAMMED ZAHEER, S/o. Mohammed Khadeer, R/o. Villa No.166, BDL Road, Bhanur (V), Patancheru (M), Sanga reddy (D), T.S., I am the document Representative of the property of an open plots bearing no's. 27, 28, 29 & 30, in Sy.No. 429, total admeasuring area 800 Sq. Yards, equivalent to 668.88 Sq.mtrs, situated at Patancheru, Sangareddy (D), T.S. That, the said property's original document **Regd. Sale deed vide Doc. No. 3709/1983, Dated: 14-11-1983, Regd. at S.R.O. Sangareddy,** have been lost by me while travelling on motor cycle from Patancheru to Muthangi on 10-8-2024. If anybody found please **Contact: 8500254818.**

రాయికోడ్ : మాటూర్ గ్రామ సభలో అర్హులకు పథకాలు అందించాలని మాట్లాడుతున్న గ్రామ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు సయ్యద్ గాలిబ్ సాబు

కంది మండలం కౌలంపేట్ గ్రామ సభలో ఆందోళనకు దిగిన గ్రామస్తులు

వట్‌పల్లి : వట్‌పల్లిలో గ్రామ సభలో అధికారులకు సమానంగా కుర్చున్న పార్టీ నాయకులు

కంగ్టి: బోర్గిలో నిర్వహించిన గ్రామసభలో అధికారులను నిలదీస్తున్న గ్రామస్తులు

సదాశివపేట : అధికారులతో వాగ్వాదం చేస్తున్న గ్రామస్తులు

నారాయణఖేడ్ : ఖేడ్ మండలం సత్యగామ గ్రామసభలో అధికారులను ప్రశ్నిస్తున్న గ్రామస్తులు

సంగారెడ్డి మండలం ఫసల్‌వాదిలో డంప్‌యార్డు ఎత్తివేయాలంటూ అధికారులను నిలదీస్తున్న గ్రామస్తులు

గరం గరంగా గ్రామసభలు

గుమ్మడిదల : కానుకుంటలో అధికారులను నిలదీస్తున్న గ్రామస్తులు

సంగారెడ్డి జనవరి 22(నమస్తే తెలంగాణ) నిలదీతలు, నిరసనలతో రెండోరోజూ రసాభసాగా మారాయి. గ్రామసభల్లో పాల్గొన్న ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. అనర్హులకు, కాంగ్రెస్ కార్యకర్తలకు పథకాలు వర్తింపజేస్తున్నారని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతుభరోసా, రైతురుణమాఫీ డబ్బులు ఎప్పుడు ఇస్తారని పలు చోట్ల రైతులు అధికారులను నిలదీశారు. పాశమైలారంలో రైతులు రైతుభరోసా డబ్బులను ప్రభుత్వం ఎప్పుడు ఇస్తుందని, వానాకాలం పోయి యాసంగి వచ్చినా ఇంకా డబ్బులు జమకాలేదని అధికారులను ప్రశ్నించారు. ఇదే విషయమై సభలో పాల్గొన్న బీఆర్‌ఎస్, కాంగ్రెస్ నాయకుల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. బీఆర్‌ఎస్ హయాంలో సీఎం కేసీఆర్ ప్రతిరైతుకు ఏడాదికి రూ.12వేలు రైతుబంధు డబ్బులు ఇచ్చారని కాంగ్రెస్ ప్రభుత్వం రైతుభరోసా ఇస్తామని రైతులను మోసం చేస్తుందని బీఆర్‌ఎస్ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. నారాయణఖేడ్ నియోజకవర్గంలోని పలు గ్రామా ల్లో ప్రజలు ఇందిరమ్మ ఆత్మీయభరోసా, రేషన్‌కార్డులు కాంగ్రెస్ నాయకులు చెప్పినవారికే ఇస్తున్నారని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు. సంగారెడ్డి, పటాన్‌చెరు, జహీరాబాద్ నియోజకవర్గాల్లో జరిగిన గ్రామసభల్లో అర్హులకు ప్రభుత్వ పథకాలు ఇవ్వటంలేదని అధికారులను నిలదీశారు.

నిరసనలతో రసాభసా

సంగారెడ్డి జిల్లాలో బుధవారం 181 గ్రామాలు, 53 మున్సిపల్‌వార్డుల్లో గ్రామసభలు, వార్డు సభలు జరిగాయి. అయితే చాలా చోట్ల ప్రజలు ప్రభుత్వ పథకాల అమలు తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో పలు చోట్ల గ్రామసభలు రసాభసాగా మారాయి. సంగారెడ్డి మండల ఫసల్‌వాదిలో గ్రామసభ రసాభాసగా మారింది. అధికారులు ప్రభుత్వ పథకాలకు ఎంపికైన లబ్ధిదారుల జాబితా చదవగానే గ్రామస్తులంతా గ్రామసభ నిర్వహణను అడ్డుకున్నారు. గ్రామంలో ఏర్పాటు చేస్తున్న డంపింగ్‌యార్డును తొలిగించాలని అతర్వాతే గ్రామసభ నిర్వహించాలని డిమాండ్ చేస్తూ గ్రామసభను బహిష్కరించారు. ఈ మేరకు తీర్మానం ఆమోదించి పత్రాలను అధికారులకు అందేశారు. కంది మండలం కలివేముల, కవలంపేట గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్లు, రేషన్‌కార్డులు అర్హులకు ఇవ్వడంలేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు. సదాశివపేట

▪ అర్హులకు పథకాలకు ఇవ్వటంలేదని జనం ఆగ్రహం

మండలం వెల్టూరు గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల అర్హులకు ఇవ్వటంలేదని ప్రజలు అధికారులను నిలదీశారు. కొండాపూర్ మండలం మల్లేపల్లిలో ఆత్మీయభరోసా, ఇందిరమ్మ ఇండ్లు అర్హులకు ఇవ్వలేదని ప్రజలు గంటపాటు గ్రామసభ జరగకుండా అడ్డుకున్నారు. నారాయణఖేడ్ మండలం సత్యగామ, తుర్కపల్లి గ్రామాల్లో ప్రజలు ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇళ్ల కోసం గొడవ చేశారు. కంగ్టి మండలం బోర్గి, దామరగిద్ద(పీఎం), మనూరు మండలం తుమ్నూరు, కల్హేర్ మండలం ఇందిరానగర్‌లో నిర్వహించిన గ్రామసభల్లో ప్రజలు కొత్తరేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇండ్ల విషయమై అధికారులను నిలదీశారు. నాగల్‌గిద్ద మండలం కారాముంగి, రేఖాతండా, మోర్గిలో ప్రజలు నిరసనకు దిగారు. కారాముంగి గ్రామసభలో పాల్గొన ప్రజలు అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ నాయకులకు చెప్పిన వారికే ఆత్మీయభరోసా, కొత్తరేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు ఇస్తున్నారని గొడవ చేశారు. హైదరాబాద్‌లో నివాసం ఉంటున్నవారికి, భూమి ఉన్నవారికి ఆత్మీయ భరోసా వర్తింపజేస్తున్నారని అధికారులను నిలదీశారు. పటాన్‌చెరు మండలం పాశమైలారం, ఇంద్రేశం, క్యాసారంలో నిర్వహించిన గ్రామసభల్లో ప్రజలు ప్రభుత్వ పథకాల లబ్ధిదారుల ఎంపికపై అధికారులను నిలదీశారు. కోహీర్ మండలం దిగ్వాల్‌లో ఇందిరమ్మ ఇళ్లు అర్హులకు ఇవ్వడంలేదని అధికారులను నిలదీశారు. దీంతో సభలో రసాభసా నెలకొనడంతో అధికారులు అరగంటలో సభ ముగించుకుని వెళ్లిపోయారు. ఝరాసంగం మండలం ఎల్గోయి, పొట్టిపల్లి గ్రామాల్లోని గ్రామసభల్లో పాల్గొన్న రైతులు రుణమాఫీ కోసం అధికారులను నిలదీశారు. రుణమాఫీ ప్రకటించి నాలుగు నెలలైనా ఇంకా డబ్బులు జమకాలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. న్యాల్‌కల్ మండలం గంగ్వార్‌లో రైతులు పంటరుణమాఫీ, రైతుభరోసా విషయమై అధికారులను నిలదీశారు. వర్షాకాలంలో జరిగిన పంటనష్టానికి సంబంధించి ఇంకా పరిహారం డబ్బులు ఇవ్వలేదని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

కోహీర్ : దిగ్వాల్ గ్రామసభలో అధికారులను నిలదీస్తున్న ప్రజలు

పటాన్‌చెరు : పాశమైలారం గ్రామసభలో రైతుభరోసాపై అధికారులను ప్రశ్నిస్తున్న రైతులు

నాగల్ గిద్ద: కారాముంగి గ్రామంలో అధికారులను ప్రశ్నిస్తున్న ప్రజలు

గ్యాస్ పరిశ్రమ వద్దంటూ ముగిసిన పాదయాత్ర

కోహీర్, జనవరి 22 : తమ గ్రామంలో గ్యాస్ పరిశ్రమను ఏర్పాటు చేయొద్దని మద్రి గ్రామ యువకులు నాలుగు రోజుల కింద చేపట్టిన పాదయాత్ర బుధవారం హైదరాబాద్‌లోని మహాత్మాజ్యోతిరావు పూలే ప్రజాభవన్ వద్ద ముగిసింది. కార్యాలయ అధికారులకు వినతిపత్రం అందజేశారు. అనంతరం తెలంగాణ ప్రగతిభవన్‌కు చేరుకొని ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్‌ను కలిసి గ్రామ సమస్యను వివరించారు. గ్యాస్ పరిశ్రమను రైతుల పొలాల మధ్య ఏర్పాటు చేయడం, పైపులు కూడా గ్రామం మధ్యలో నుంచి వేస్తుండడం చాలా ప్రమాదకరంగా మారిందన్నారు. పోలీసులు కూడా పరిశ్రమకు అనుకూలంగా మాట్లాడుతున్నారన్నారు. తమకు సహకరించాలని కోరారు.

ఎంఈవో కార్యాలయానికి కుర్చీలు అందజేత

మునిపల్లి, జనవరి 22 : టీపీటీఎఫ్ యూనియన్ సంఘం సేవలు అమోఘమని మునిపల్లి మండల ఎంఈవో బీమ్‌సింగ్ తెలిపారు. బుధవారం మండల కేంద్రమైన మునిపల్లిలోని ఎంఈవో కార్యాలయానికి మునిపల్లి మండల టీపీటీఎఫ్ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో 50 కుర్చీలు, ఫ్లోర్ మ్యాట్ అందించినట్లు తెలిపారు. మునిపల్లి ఎంఈవో కార్యాలయంలో కొంత కాలంగా కుర్చీల కొరత ఉండడం గమనించిన మునిపల్లి మండల టీపీటీఎఫ్ ఉపాధ్యాయ సంఘం ఎంఈవో కార్యాలయానికి 50 కుర్చీలు, ఫ్లోర్ మ్యాట్ అందించడం సంతోషంగా ఉందన్నారు. టీపీటీఎఫ్ యూనియన్ మండలాధ్యక్షుడు లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శి సంతోషమ్మ, నోడల్ ఆఫీసర్ భాస్కర్, నాయకులు గోవర్ధన్, అమీనొద్దీన్, అశోక్, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

పటాన్‌చెరు ఎమ్మెల్యేపై మండిపడిన కాంగ్రెస్ నాయకుడు

ఎమ్మెల్యే, అధికారుల తీరుపై అసహనం వ్యక్తం చేస్తున్న కాంగ్రెస్ నాయకుడు రాజుగౌడ్

రామచంద్రాపురం, జనవరి 22: కొల్లూర్ ప్రజలను ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి మోసం చేశాడని కాంగ్రెస్ పార్టీ నాయకుడు రాజుగౌడ్ మండిపడ్డారు. బుధవారం తెల్లాపూర్ మున్సిపాలిటీ కొల్లూర్‌లో అభివృద్ధి పనుల ప్రారంభోత్సవానికి స్థానిక కౌన్సిలర్లకు సమాచారం ఇవ్వకుండా ఎమ్మెల్యే వచ్చారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యేగా ఆయన కొల్లూర్‌కు చేసింది ఏమి లేదని, ఇక్కడ ఇంత పెద్ద గ్రామసభ జరుగుతుంటే ఇక్కడికి వచ్చి ప్రజా సమస్యలను అడిగితే బాగుండేదని అన్నారు. గ్రామసభను పట్టించుకోకుండా ఎమ్మెల్యే ఇలా వచ్చి అలా వెళ్లిపోతే ప్రజా సమస్యలు ఏవిధంగా పరిష్కారమవుతాయని ప్రశ్నించారు. కొల్లూర్‌లో డబుల్ బెడ్ రూంలో భూములు కోల్పోయిన రైతులకు డబుల్ బెడ్‌రూం ఇండ్లు ఇస్తామని ఎమ్మెల్యే మాట ఇచ్చి మోసం చేశాడని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత కూడా కాంగ్రెస్ నాయకులకు మనుగడ లేకుండా పోతుందన్నారు. బీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి పార్టీ మారిన ఆయన కాంగ్రెస్ ఉనికి లేకుండా చేస్తున్నారని, ఈ విషయాన్ని హైకమాండ్ దృష్టికి తీసుకుపోతామని అన్నారు.

కాంగ్రెసోళ్లకే సఖ్యత లేదు..

చైర్‌పర్సన్ లలితాసోమిరెడ్డి, బీఆర్‌ఎస్ నేత సోమిరెడ్డి

సమావేశంలో మాట్లాడుతున్న చైర్‌పర్సన్ లలితాసోమిరెడ్డి దంపతులు

రామచంద్రాపురం, జనవరి 22 : నిత్యం తెల్లాపూర్ మున్సిపాలిటీ అభివృద్ధి కోసమే పని చేశామని, ఏనాడు తమ స్వలాభం కోసం పని చేయలేదని తెల్లాపూర్ మున్సిపల్ చైర్‌పర్సన్ లలితాసోమిరెడ్డి దంపతులు అన్నారు. తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలో మున్సిపల్ తీర్మానం మేరకు రూ.17. 80 కోట్ల అభివృద్ధి పనులకు చైర్‌పర్సన్ లలితాసోమిరెడ్డితో కలిసి ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. సుమారుగా రూ.8 కోట్లతో నిర్మించిన ఫంక్షన్‌హాల్‌ని ప్రారంభోత్సవానికి సిద్ధం చేసిన తరుణంలో ప్రారంభోత్సవం చేయొద్దని జిల్లా ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు రావడంతో చైర్‌పర్సన్, కౌన్సిలర్లు ఆవేదన వ్యక్తం చేశారు. ఫంక్షన్‌హాల్ ప్రారంభోత్సవాన్ని కాంగ్రెస్ నాయకులు ఉద్దేశపూర్వకంగానే అడ్డుకున్నారని అన్నారు.

కస్తూర్బా విద్యాలయం ఆకస్మిక తనిఖీ

కేజీబీవీలో సమస్యలు తెలుసుకుంటున్న ఆర్డీవో

సిర్గాపూర్, జనవరి 22 : మండల కేంద్రమైన సిర్గాపూర్‌లోని కస్తూర్బా విద్యాలయాన్ని నారాయణఖేడ్ ఆర్డీవో అశోక చక్రవర్తి బుధవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈమేరకు స్థానిక టెన్త్ విద్యార్థినులతో ఆయన మాట్లాడారు. వారి సమస్యలు, బోధన తీరు, సిలబస్, మౌలిక వసతుల పట్ల ఆయన అడిగి తెలుసుకున్నారు. టెన్త్‌లో ఉత్త మ ఫలితాలు సాధించి ఉన్నత విద్యాభ్యాసాన్ని చేపట్టాలని సూచించారు. అనంతరం స్థానిక ప్రిన్సిపాల్ సంతోషి, స్థానిక టీచర్లతో సమావేశమై విద్యాభివృద్ధిపై సమీక్షించారు. సమావేశంలో తహసీల్దార్ ఉమాశంకర్, ఎంఈవో నాగారం శ్రీనివాస్, సీఆర్‌పీ శివకుమార్, టీచర్లు ఉన్నారు.

రోడ్డుపై గుంతలు పూడ్చిన పోలీసులు

కల్హేర్ రోడ్డు పై మొరం పోయిస్తున్న పోలీసు అధికారులు

కల్హేర్, జనవరి 22 : బైకులు నడపాలంటేనే నరకం కనిపించే విధంగా రోడ్డుపై ఏర్పడిన గుంతలను కంగ్టి సీఐ చంద్రశేఖర్‌రెడ్డి, కల్హేర్ ఎస్సై వెంకటేశం ఆధ్వర్యంలో ట్రాక్టర్లతో మొరం పోయించారు. 161 నంబర్ జాతీయ రహదారి నుంచి మండల కేంద్రమైన కల్హేర్ వరకు 4.5కిలో మీటర్ల దూరం ఉన్నది. కొన్నేండ్లుగా బీటీ రోడ్డు కంకర తేలి పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. రోడ్డుపై బైకులు నడపడమే కష్టతరంగా మారింది. ఇక కార్లపై రావాలంటే డ్రైవర్లు, ఓనర్ల గుండె దడ అధికంగా అవుతుంది. ఎందుకంటే ఏ పడి కారు పాడవుతుందోననే భయం. ఈ రోడ్డుపై రాకుండా ఇతర మార్గాల గుండా కల్హేర్‌కు వస్తున్నారు. దీంతో పోలీసులు చేసిన పనికి మండల ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తూ పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.

ఉద్యమకారులకు ఇంటి స్థలాలు ఇవ్వాలి

బీఆర్‌ఎస్ నాయకుడు మంద భాస్కర్‌రెడ్డి

గుమ్మడిదల, జనవరి 22 : కాంగ్రెస్ పార్టీ తెలంగాణ ఉద్యమకారులకు 250 గజాల ఇంటి స్థలం ఇస్తానని ఎన్నికల్లో ఇచ్చిన హామీని తుంగలో తొక్కిందని తెలంగాణ ఉద్యమకారుడు, బీఆర్‌ఎస్ జిల్లా నాయకుడు మందభాస్కర్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం ఆయ న విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా జాప్యం చేస్తుందని ఆయన ఆరోపించారు. బుధవారం గుమ్మడిదలలో జరిగిన గ్రామసభలో ఆయన మాట్లాడారు. తదనంతరం కాంగ్రెస్ సర్కారుపై పోరాటం చేసేందుకు కార్యాచరణ సిద్ధం చేస్తామన్నారు. తమఉద్యమకారులకు న్యా యం జరిగే వరకు పోరాటం చేస్తామని డి మాండ్ చేశారు.

ఫ్యాక్టరీకి తరలించే చెరుకు దగ్ధం

జహీరాబాద్, జనవరి 22 : మొగుడంపల్లి మండలంలోని గౌసాబాద్ గ్రామ శివారులో బుధవారం సాయంత్రం పొలంలో చెరుకు లోడ్ చేసుకుని వెళ్తున్న లారీని విద్యుత్ వైర్లు తగిలి పాక్షికంగా కాలిపోయింది. స్థానిక గ్రామస్తులు కథనం ప్రకారం.. మండల బీఆర్‌ఎస్ అధ్యక్షుడు సంజీవ్‌రెడ్డికి చెందిన పొలంలో చెరుకు లోడ్ చేసుకుని ఫ్యాక్టరీ వెళ్తున్న క్రమంలో విద్యుత్ వైర్లు తగిలి మంటలు రేగాయి. వెంటనే అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. వెంటనే సంఘటన స్థలానికి చెరుకుని మంటలను ఆర్పివేశారు. దీంతో లారీ పాక్షికంగా కాలిపోయింది. 10 ఎకరాల పొలంలో నరికిన చెరుకుతో పాటు డ్రిప్ పరికారులు, పంపు సెట్ తదితర వస్తువులు కాలిపోయాయి. దీంతో రూ. 10 లక్షల వరకు నష్టం జరిగిందని బాధిత రైతు వాపోయాడు.

పారదర్శకంగా ఎంపిక చేపట్టాలి

మాట్లాడుతున్న ఎమ్మెల్యే చింతా ప్రభాకర్

సంగారెడ్డి జనవరి 22 : రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పథకాల లబ్ధిదారుల ఎంపికలో పారదర్శకత పాటించాలని సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ డిమాండ్ చేశారు. బుధవారం సంగారెడ్డిలోని క్యాంప్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం తీరుపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. గ్రామసభలు ప్రభుత్వాన్ని నిలదీసే సభలుగా మారాయని ఎద్దేవా చేశారు.అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు, రేషన్‌కార్డులు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు.

సైబర్ వలలో ఫొటో స్టూడియో యజమాని

సిర్గాపూర్, జనవరి 22 : మండల కేంద్రమైన సిర్గాపూర్‌కు చెందిన ఫొటో స్టూడియో యజమాని పవన్‌కుమార్ సైబర్ మోసానికి గురయ్యాడని స్థానిక ఎస్సై వెంకట్‌రెడ్డి బుధవారం తెలిపారు. ఓఎల్‌ఎక్స్ కెమెరా అన్‌లైన్‌లో తక్కువ ధరకు వస్తుందని అవతల వ్యక్తి ద్వారా తెలుసుకొని రూ. 1.34లక్షలు ఆన్‌లైన్ పేమెంట్ చేశాడు. అనంతరం ఆ వ్యక్తి నుంచి ఫోన్ స్విచ్ ఆఫ్ రాగా, మోసపోయానని గ్రహించి బాధితుడు పవన్‌కుమార్ ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసినట్లు ఎస్సై వెల్లడించారు.

ప్రాథమిక స్థాయి విద్యను మెరుగుపర్చాలి

సిర్గాపూర్, జనవరి 22 : ప్రాథమిక స్థాయి విద్యను మెరుగు పర్చాలని జిల్లా విద్యాధికారి వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం మండలంలోని లక్ష్మణ్ నాయక్ తండా ప్రాథమిక పాఠశాలను సందర్శించి ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా తరగతి గదిలో వెళ్లి విద్యార్థుల అభ్యాసన అభివృద్ధి తీరును పరిశీలించారు. అనంతరం విద్యా బోధన సామర్థ్యాల పెంపు కోసం తీసుకోవాల్సిన చర్యలపై ఆయన టీచర్లకు సూచనలిచ్చారు. కార్యక్రమంలో ఎంఈవో నాగారం శ్రీనివాస్, సీఆర్‌పీలు శివకుమార్‌స్వామి, శోభ, స్థానిక హెచ్‌ఎం, టీచర్లు ఉన్నారు.

జర్నలిస్టు కుటుంబాన్ని ఆదుకున్న ఆరోగ్యబీమా

పటాన్‌చెరు, జనవరి 22 : ఆరోగ్యబీమా నుంచి జర్నలిస్టు కుటుంబం లబ్ధిపొందింది. బుధవారం పటాన్‌చెరు ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో రామచంద్రాపురం సీనియర్ జర్నలిస్టు కుమారుడు సుమంత్ రాజ్ ఎమ్మెల్యేకు ధన్యవాదాలు తెలిపారు. ఎమ్మెల్యే తన సొంత నిధులతో జర్నలిస్టులకు ఆరోగ్యబీమా చేయించారు. ఈ ఆరోగ్యబీమా ద్వారా రూ. 12.50లక్షల వైద్య సేవలను సుమంత్ రాజ్ పొంది ఆరోగ్యవంతయ్యాడు. గతేడాది కూడా రూ. 6లక్షల వైద్య సేవలను ఆ కుటుంబం పొందింది. జర్నలిస్టులకు ఆరోగ్యబీమాతో భరోసా కల్పించారని కుటుంబ సభ్యులు ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

అప్రమత్తంగా ఉండాలి

హత్నూర, జనవరి 22 : వ్యాధులపట్ల అప్రమత్తంగా ఉండాలని హత్నూర మండలం బోర్పట్ల ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు హిమబిందు సూచించారు. బుధవారం గ్రామంలోని ఎస్సీ కాలనీలో కొందరు అస్వస్థతకు గురికావడంతో వైద్యపరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. అనారోగ్యసమస్య తలెత్తితే వెంటనే వైద్యులను సంప్రదించాలన్నారు.

చెరుకు పంట దగ్ధం

జహీరాబాద్, జనవరి 22 : జహీరాబాద్ నియోజకవర్గంలోని మండల కేంద్రమైన మొగుడంపల్లిలోని కౌలు రైతు సాగు చేసిన చెరుకు పంట అగ్నికి ఆహుతైంది. గ్రామస్తులు కథనం ప్రకారం.. మండలంలోని సున్నంబట్టి గిరిజన తండాకు చెందిన దేవిసింగ్ అనే రైతు మొగుడంపల్లిలో ఐదు ఎకరాల పొలాన్ని కౌలుకు తీసుకుని చెరుకు పంట సాగు చేశారు. మంగళవారం రాత్రి ప్రమాదవశాత్తు సాగులో ఉన్న 3 ఎకరాల చెరుకు పంటకు నిప్పంటుకుని పూర్తిగా దగ్ధమైంది. దాదాపు రూ. 3 లక్షల వరకు నష్టం వాటిల్లిందన్నారు. బుధవారం సంఘటన స్థలాన్ని మండల రెవెన్యూ, వ్యవసాయాధికారులు పరిశీలించారు. బాధిత కౌలు రైతును ప్రభు త్వ పరంగా ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

పంటల పరిశీలన

అందోల్, జనవరి 22 : మండల పరిధిలోని చింతకుంట గ్రామంలో బుధవారం రైతుల పంటపొలాలను పరిశీలించి పలు సూచనలు చేసినట్లు సంగుపేట ఏరువాక కేంద్రం కో-ఆర్డినేటర్ రాహుల్‌విశ్వకర్మ తెలిపారు. యాసంగిలో చేపట్టాల్సిన యాజమాన్య పద్ధతులను, సాగులో పాటించాల్సిన మెలుకువలను రైతులకు వివరించారు. ఏడీఏ రమాదేవి, ఏఈవో లక్ష్మీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

మద్యానికి బానిసై ఆత్మహత్య

జిన్నారం (బొల్లారం) జనవరి 22 : మద్యానికి బానిసైన ఓ వ్యక్తి ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన ఐడీఏ బొల్లారం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ రవీందర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. ఒడిశా రాష్ట్రం గంజాం జిల్లాకు చెందిన జనాంగి భాస్కరరావు (36) మద్యానికి బానిసయ్యాడు. మంగళవారం రాత్రి గదిలో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి అన్న కొడుకు బాలరాజ్ ఫిర్యాదు మేరకు బుధవారం పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.